

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 11    మార్చి, 2015    సంచిక : 10

**గౌరవ సంపాదకత్వం**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech

**సాయివాణి చందా వివరాలు**

వార్షిక చందా ........ రూ॥ 80/-

ఆజీవ సభ్యత్వం ........ రూ॥ 800/-

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126.

**Ph : 9440413455, 9848133565**

Website : www.saidhamam.org

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .......... 2
గురు జన్మదినోత్సవం .......... 7
గజానన విజయం .......... 9
షిర్డీసాయి చరితము .......... 11
షిరిడీ డైరీ .......... 12
సాయిధామంతో మేము .......... 14
ఆశీరక్షతలు .......... 16
ఆనందం .......... 17
DECLARATION .......... 20
మాతృసంస్థ కబుర్లు .......... 21
చిట్టి గురువు .......... 24
నదీ, ఓ నదీ .......... 26
పెన్నిధి .......... 27
స్వరాంజలి .......... 28
ఆరోగ్య (ఆసుపత్రి .......... 29
సందేహానికి సమాధానం .......... 30







# మా వాణి



## పుట్టిన రోజు

పుట్టటం, పెరగడం, కన్నుమూయటం-యిది ప్రతి జీవికీ సహజమే. కన్ను తెరిస్తే జననం, కన్ను మూస్తే మరణం, నట్టనడిమి నాటకం జీవితం- అన్నారు పెద్దలు. మనిషిగా జన్మించడం అన్నది ఒక గొప్ప యోగం. ఎన్నెన్నో జన్మలలో ఏ కాస్త పుణ్యం మిగిలి ఉన్నా దానిని వెలబోసి కొనుక్కునే అమూల్య వరం యిది. ఇక వెనక మనకంటూ సంపత్తి ఏమీ మిగల్లేదు- ఈ ఒక్క జన్మే మనకు మిగిలిన సిరి. అలాంటిదాన్ని ఎలా వాడుకోవాలన్నది మన చేతిలో ఉన్న విషయం. ఈ విషయంలో పూర్తి అధికారం మనకు లేకపోయినా-ఆవుకు తాడుకట్టి పచ్చిక మైదానంలో వదిలితే కట్టుగొయ్య నుంచీ అది ఎంత పరిధిలో తిరగాలో దాని యిష్టం-దాని హక్కూను- ఆ మాత్రం స్వేచ్ఛ మనకున్నది గదా! ఆ మేరకు జన్మ ధన్యం చేసుకోవటమా, "ప్రాణమా, తినుము త్రాగుము, సుఖించుము" అని సాయిలా పాయిలాగా బ్రతికెయ్యటమా? అన్నది మన యిష్టం. ఇంత కథ మన జన్మ వెనుక ఉండగా -

పుట్టినరోజు పండుగ చేసుకోవటం అంటే యిప్పుడొక ఆచారంగా, ఫేషన్‌గా, విలాసంగా కూడా మారింది. చిన్న పిల్లలకు ఇదొక ఆనందం. వాళ్ళు దాన్ని హేపీ బర్త్‌డేగా అభివర్ణించేసుకొంటూ ఉంటారు. (పుట్టినరోజు గడిచిన మరుసటి వారం నుంచీ మళ్లీ దానికోసం ఎదురుచూస్తూనే ఉంటారు కూడా.) పూర్వం సామాన్యులలో జన్మదినోత్సవాలు అంటూ జరిపే ఆచారం లేదు. పైగా "ఇచ్చినవాడు మర్చిపోతే" అని ఒక సామెత ప్రాచుర్యంలో ఉండేది. క్షణక్షణం వయసు లెక్కించటం కొంత ఆయుక్షీణంగా

భావించిన సంప్రదాయం కూడా ఉంది. (ప్రతినెలా పుట్టినరోజు పేరిట నెలల పసిగుడ్డులను పదిమంది ముందర ప్రదర్శించటం మరీ అతిశయం-శిశువుకు చెరుపూను.) అది ఒక శుభదినంగా తల్లిదండ్రులు బిడ్డలకు హారతిచ్చి అక్షతలు వేయడం, తీపి తినపించటంతో, దైవదర్శనంతో పూర్తయ్యేది. కాలక్రమంలో పుట్టినరోజు స్వరూప స్వభావాలు మారిపోయి, కేకులు (మన మిఠాయిలు మరీ ఓల్డ్ నాన్సెన్స్) వాటి మీద దీపాలు, వాటిని ఆర్పడాలు, మిత్రులు, విందులు వినోదాలు-యువకులలో తాగుళ్లు, తందనాలు వగైరాలు పెచ్చుపెరిగిపోయాయి. శుభం జరిగితే దీపాలు పెట్టి ఉత్సవాలు చేసుకొనే సంస్కృతి కాస్తా దీపాలార్పడం దాకా ఎదిగిపోయింది. పాశ్చాత్యులు తమ జీవితాలలో ఎన్నేళ్లు గడిపేరన్నదానికి గుర్తుగా దీపాలు ఆర్పుతారు. మనం అలా కాదు-"స్వామీ, ఇన్నేళ్ల జీవితం నీ కరుణ వలన వెలుగులు చిమ్ముతూ చల్లగా గడిచింది. ఇకపైన కూడా తోడై నిలువు" అనడానికి గుర్తుగా దేవునిముందు దీపాలు పెడతాం. అది సత్సంప్రదాయం. మనలోపలి ప్రాణజ్యోతికి అది శ్రీరామరక్ష.

మనవికాని పుట్టినరోజులు మనం ఎంతో సంతోషంగా జరుపుకొనేవి కొన్ని ఉన్నాయి. అవి లోకాన్ని తమ శక్తిసామర్థ్యాలతో, పవిత్రతతో వెలిగించిన వారి జన్మదినాలు. శ్రీరామనవమి, కృష్ణాష్టమి, దత్త జయంతి, రామకృష్ణ పరమహంస జయంతి, గురునానక్ జన్మదినం వంటివి. స్వాతంత్ర్యం జన్మదినం, గణతంత్రం జన్మదినంలాంటివి కూడా చేసుకొంటాం. ఇవన్నీ దేశ చరిత్రలో, ప్రపంచ చరిత్రలో మైలురాళ్లుగా నిలబడిపోయిన కొన్ని పవిత్ర దినాలుగా మనం భావిస్తాం. మరి, మన పుట్టినరోజులో ....?

మనం జన్మదినోత్సవాలు చేసుకొనేటప్పుడు మన బంధుమిత్రులకు, మన ఆప్తులకు, రేపు మనకు పనికి వస్తారనుకొన్నవాళ్లకు విందులు చేయటం, ఆడంబరంగా ఇళ్లు అలంకరించటం, మరికాస్త ముందుకు వెళ్లి ఏ హోటల్‌లోనో, క్లబ్బులలోనే పార్టీలు (చుక్క, ముక్క, చక్కని చుక్క





లతో తైతక్కల వరకు) ఏర్పాటు చేయటం ఒక ప్రిస్టేజ్ ఇష్యూగా భ్రమపడే నాగరికతలో కొట్టుకుపోతున్నాం. ఇంకో తమాషా ఏమిటంటే -

తమకీజన్మ ప్రసాదించిన తల్లిదండ్రుల బాగోగులు పట్టించుకోకుండా, వాళ్ల ఆస్తిపాస్తులను-వాళ్ల జీవితాల్లో కనీసం పాతికేళ్ల జీవితాన్ని తమను పెంచి పెద్దచేసి, విద్యావంతులను చేయడానికి ధారపోసిన శ్రమను-మొత్తాన్నీ దిగమింగేసి, 'బర్త్‌డే పార్టీలు' చేసుకొనే ప్రబుద్ధుల సంఖ్యకు కూడా కరువేమీ లేదు. మనం-హిందువులం ముఖ్యంగా పండుగలంటే కొత్త బట్టలు, పిండివంటలు, సరదాలు మాత్రమే అనుకొని అసలు ఆ పండుగ మూలకారణాలు మర్చిపోతుంటాం. అలాగే అధునాతనులు కొందరు జన్మదినానికి మూలకారకులైన తల్లిదండ్రులను వెట్టికి వదిలేసి పూతమెరుగులతో బ్రతికేస్తున్నారు. దైవదర్శనానికంటే కూడా ముందర మాతాపితరుల స్మరణ, నమస్కారం కర్తవ్యం అని గుర్తుంచుకోవాలి.

మనం పుట్టిన ప్రయోజనం ఏమిటి? ఈ జన్మను సార్థకం ఎలా చేసుకోవాలి?-ఈ ప్రశ్నలు అనాదిగా జ్ఞానం వచ్చింది మొదలు మనిషికి కలుగుతూ వచ్చాయి. విజ్ఞులైన వారు ఆ ప్రశ్నల మీద యోచన, పరిశోధనలు చేసి కొన్ని మార్గాలు సూచించారు. మన పై జన్మను వ్రాసుకోగల శక్తి మన చేతులలోనే ఉన్నదని గ్రహించారు. ఆ మేరకు జీవించే ప్రయత్నాలు చేసారు. 'నీ మంచిచెడులకు కారణం నీ కర్మే. కనుక సత్కార్యాలాచరించి ఉత్తమ జన్మను సాధించుకో' అని సామాన్యులకు హితవు చెప్పారు. మన శాస్త్రాలు, కావ్యపురాణాదులు కథలు గాథలుగా ఇదే విషయం ఉపదేశించాయి. ఆ మార్గాలను అనుసరించి నిర్మలాత్ములుగా, లోకహితైషులుగా, ప్రేమమయులుగా, గురువులుగా, త్యాగమూర్తులుగా, దేశభక్తులుగా నిలచిన వారి జన్మదినాలు జాతి ఎంతో అభిమానంతో, గౌరవంతో, భక్తి శ్రద్ధలతో, వారు లేకపోయినా జరుపుకొంటూనే ఉన్నది, ఉంటుంది కూడా. ఏ ఒక్క తెగకో, ఒక చిన్న లక్ష్యానికో

సీమితమై (పరిమితమై) జీవించిన వారికి కొన్ని రోజులు నడిచినా కాలక్రమంలో మరుగునబడిపోతాయి. కానీ పావనజీవనులైన వారి జన్మ తిథులు మాత్రం శాశ్వతంగా నిలచిపోతాయి. అలా నిలవాలంటే మనం ఎలా ఉండాలి?

మన జీవితంలో ఎంత భాగం సమయం, ధనం, శక్తియుక్తులు ఇత రుల కోసం-ఎటువంటి బంధమూ, స్వార్థమూ లేకుండా ఉపయోగి స్తున్నాం? అని ఎప్పటికప్పుడు ఆలోచించుకొంటూ జీవించాలి. మన పుట్టిన రోజు కేలెండర్ మీద మాత్రమేకాక జనం గుండెల మీద ముద్రపడి ఉండే లాగా చూచుకోవాలి. "దేశం నాకేం చేసింది? సమాజం నాకేమిచ్చింది?" అని కాక- "దేశానికి నేనేం చేసాను? సమాజానికి నేనేమిచ్చాను?" అని మనను మనం ప్రశ్నించుకోవాలి. నేలబారు నుంచీ ఆకాశమంత ఎత్తుకు ఎదిగినవాళ్లు ఎంతోమంది ఉండవచ్చు. అంతటితో ఆగేవారు ఎక్కువ. కాగా ఎదిగాక తమ ఆదాయంలోనుంచీ ఇతరులక్కూడా కొంత పంచిన వారూ ఉండవచ్చు. కానీ, తమ జీవితం మొత్తంలోనూ ఇతరులను గుండె లకు హత్తుకొని, వారి కష్టసుఖాలతోసహా తన కౌగిట పొదువుకొని, వారిని కూడా తమతోపాటు నడిపినవారు మాత్రం చాలా అరుదుగా కనిపిస్తారు. అలాంటి అరుదైన జీవనాన్ని గడిపేందుకు మనం ప్రయత్నం చేస్తుండాలి. సామాన్యుడికీ మాన్యుడికీ మధ్య ఒక్క అక్షరమే తేడా. సహజంగా మనిషి జ్ఞానే. మాయపొర స్వార్థరూపంలో, కాంక్షల రూపంలో ఆవహించి అహం భావిగా, అజ్ఞానిగా మారుస్తుంది. సాధనతో ఆ పొరను తొలగించుకొంటే- కనీసం పలచబరుచుకొంటే క్రమంగా లోవెలుగు వెలికి ప్రసరిస్తుంది. చుట్టూ ఉన్న జగతిని వెలిగింపజేస్తుంది. అదే మనిషి పేరుకు శాశ్వతత్వాన్ని ప్రసాదిస్తుంది. అలాంటి ప్రయత్నం మన శక్తిమేరకు చేస్తూపోవడమే మన కర్తవ్యం-మనకు ధన్యత కలిగే మార్గమూ కూడా. నిర్మమంగా, నిరహం భావంగా దైవప్రసాదిత జన్మను దైవస్వరూపమైన సృష్టికి సమర్పించుకోవ డమే జన్మకు పరమార్థం. అది గుర్తెరిగిన వారి జన్మదినం జగత్కళ్యాణానికి పుట్టినరోజవుతుంది.

ప్రపంచంలో అందరూ మాన్యులు కావటం జరగదుగదా-కాని





కావాలని ప్రయత్నించటంలో తప్పు లేదుగా! ఏమి బహుమతులు, ఏ ఆనందాలు పొందగలం-అని కాక-ఆనాడు ఎవరిని ఏ విధంగా ఆనం దింపజేయగలం? మన తల్లిదండ్రులను లేదా ఆ వయ సున్న పెద్దలను ఎలా ఆనందింపజేయగలం? దానధర్మాది సత్కార్యాలు ఎన్ని ఎలా చేయ గలం? మనకు ఈ జన్మ ప్రసాదించిన పరమాత్మను ఆనాడు ఎలా సేవించ గలం? - ఇలా ఆలోచించుకుందాం. అంతేకాదు- ఆ రోజు కనీసం రెండు గంటలసేపైనా ఆత్మవిచారణ-"పుట్టి ఏమి సాధించాం? ఇంకా ఏం చెయ్య గలం? మనలోని మంచి చెడులేమిటి?" అన్నీ తర్కించుకొని కొన్ని చక్కని నిర్ణయాలు తీసుకుందాం. అప్పుడు పుట్టినరోజుకు సార్థకత. కదూ!

# సందేహానికి సమాధానం

**(32వ పేజీ తరువాయి)**


వారేదో సాధన చేస్తారు. ఇది కులాచారంగా వస్తున్నది. ముక్కాలిపీట ద్వారాను, ఆంగ్ల అక్షరాలు వ్రాసిన కాగితం మీద గాజుపలకను పెట్టి, దాని మీద ఒక నాణేన్ని ఉంచి దానిపై రెండు చూపుడువ్రేళ్లుపెట్టి పరిచితమైన ఆత్మను తలుచుకొని ప్రశ్నిస్తే ఆ నాణెం జరుగుతూ అక్షరాలను చూపిస్తుంది. అవి కలిపితే సమాధానం వస్తుంది. ఈ విధంగా వేరేస్థాయిలో ఉన్న ఆత్మ లను బలవంతంగా మన స్థాయికి గుంజటం సరైన పద్ధతి కాదు.

మన రాష్ట్రంలోనే ఒకప్పుడు ఒక ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాలుగా పనిచేసిన లక్ష్మీనారాయణగారనే పెద్దమనిషి హైద్రాబాదు సిటీలోనే ఉంటూ పెద్ద పదవులలో ఉన్నవారు, యూనివర్శిటీ అధ్యాపకుల ముందు ఆటోరైటింగ్ ద్వారా ఆత్మలను పిలిచి ప్రశ్నలు వేసి సమాధానాలు వ్రాయించేవారు.

ఈ ప్రయోగాలు అన్నింటిద్వారా తేలింది ఏమంటే యీ ఆత్మలు సూక్ష్మ శరీరంతో గరిష్ఠంగా ఎనభై సంవత్సరాల వరకు (మన లెక్క ప్రకారం) అలాగే ఉండే అవకాశం ఉన్నదని (ఈ పరిశోధనా సంస్థ బ్రాంచి పూణే నగరంలో ఉన్నది.)

# గురు జన్మదినోత్సవం





ప్రియ మిత్రులారా,

మళ్ళీ మనమందరం ఒక్కచోట కలిసి గురుదేవుల శ్రీచరణాలకు నమస్కరించుకొనే అవకాశం-అద్భుతతరుణం వచ్చింది. "చేజారినదీ ఇంకొకరోజు గురుపద దర్శన భాగ్యము లేక" అని విచారిస్తూనే ఉంటాం అప్పుడప్పుడూ మనసు కలత చెందినప్పుడంతా. మామూలు దినచర్యలలో మనకు గురుదర్శనభాగ్యం కలగటం కొంచెం కరువే. కానీ, కొన్ని రోజులలో తప్పనిసరిగా ఆ భాగ్యాన్ని చేజిక్కించుకొని తీరాలి. అవి గురుపూర్ణిమ, గురు జన్మదినం, మనం ఉపదేశం తీసుకున్న రోజు-ఈ మూడూ అవి. అందుచేత రానున్న **ఫాల్గుణ బహుళ విదియ శనివారం (మార్చి 7వ తేదీ)నాడు** రానున్న మన పూజ్య గురుదేవులు **శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారి** జన్మదినం సందర్భంగా - సాయిధామం ఆశ్రమంలో జరుగనున్న గురు జన్మదినోత్సవంలో అందరం పాల్గొని తరిద్దాం, రండి ఆనాటి కార్యక్రమ వివరాలు దిగువ ఇస్తున్నాము.

| | |
|---|---|
| ఉదయం6-30 | క్షీరాభిషేకం - శ్రీ సాయికి నూటొక్క కలశాలతో జలాభిషేకం |
| గం.8-30 | అష్టోత్తర శతనామ పూజ |
| గం.9-00 | సాయిచాలీసా, విష్ణు సహస్ర నామం, చరిత్ర పారాయణల ఫలితాన్ని శ్రీ సాయికి ధారపోయటం. |
| గం.10-00 | శ్రీ సాయి దేవులకు వివిధ పుష్పాలతో పూజ |
| గం.10-30 | గురుదేవులకు అర్చన, గురుస్తుతి |
| గం.11-00 | సాంస్కృతిక కార్యక్రమం |
| గం.11-45 | గురుదేవుల ప్రవచనం |
| గం.12-00 | మహా హారతి |
| గం.12-30 | గురుదేవులకు నమస్సులు, ఆశీస్సులు |
| గం. 1-00 | అన్నప్రసాద వితరణ |





# గురు జన్మదినోత్సవంలో చెయ్యి కలపండి

ప్రియ మిత్రులారా,

ఫాల్గుణ బహుళ విదియ - మార్చి 7వ తేదీన పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారి జన్మదినోత్సవం జరుగనున్నది. ఆ సందర్భంగా మనమంతా చెయ్యవలసిన కార్యక్రమాలు దిగువ ఇస్తున్నాము. వీలైనంత ఎక్కువమందిని మీతో కలుపుకొని దిగువ కార్యక్రమాలన్నీ చేయ వలసిందిగాను, శ్రీ సాయి ఆశీస్సులు పొంద వలసిందిగానూ ఆహ్వానిస్తున్నాము.

1) శ్రీ సాయి సచ్చరిత్ర లేదా చరితామృతం లేదా ఆదిగురువు-దత్త ప్రభువు ఒక సప్తాహ పారాయణ చేయడం -
2) కనీసం రోజుకు 108 సార్లు 'ఓం శ్రీ సాయిరామ్' నామాన్ని జపం చేయటం
3) 'సాయిరాం-సాయిరాం' అని ఒక్కొక్క గింజకూ ఒక్కొక్కసారిగా పలుకుతూ కనీసం గుప్పెడుబియ్యం చేసి తాము వచ్చేటపుడు తేవ టం-(ఇవి అక్షతలలోనూ, అన్నదాన బియ్యంలోనూ కలుపుతాము)
4) రోజుకు ఒక్కసారి సాయిచాలీసా, విష్ణు సహస్ర నామం, హనుమాన్ చాలీసా వంటివి చదవడం
5) మీ పరిసరాలలో ఉన్న దేవాలయాలలో గురుదేవుల ఆరోగ్య నిమిత్తం అష్టోత్తర శతనామ పూజలు చేయించటం -
6) మీకు వీలైతే (దూర ప్రాంతాల వారు) ఆసుపత్రులలో ఫలవితరణ, పేదలకు అన్నదానాలు, వస్త్రదానాల వంటివి చేయవచ్చు.
7) పారాయణ చేసిన గ్రంథాన్ని సిల్కు/పట్టు బట్టలో కట్టి పసుపు, కుంకుమ లతో, అక్షతలు, పూలతో అలంకరించి ఒక పళ్ళెంలో ఉంచి శిరస్సున ఉంచుకొని సాయిధామానికి తీసుకొని రండి. సాయి చుట్టూ ప్రదక్షిణ చేసి, ఆ పారాయణ శక్తి సాయి పాదాల మీద ధారపోయండి.
8) మీ ఊరి బావిలోని నీళ్ళు ఒక్కో ఊరికి ఒక్కొక్క బిందె (పూలు, మామిడాకుల తోరణం కట్టి, పసుపుకుంకుమలు పెట్టి తీసుకురండి. వాటితో సాయికి స్వయంగా అభిషేకం చెయ్యండి. (ఇలా చేయదలచు కొన్నవారు ఉదయం ఆరున్నర-ఏడు మధ్యలోనే ఆశ్రమానికి రావలసి ఉంటుంది.
9) 7వ తేదీన ఉత్సవానికి రమ్మని మీకు తెలిసిన సాయిభక్తులకు చెప్పండి.

**- మీ మాతాజీ, సాయిధామం**

# శ్రీ గజానన విజయం



- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు

(గత సంచిక తరువాయి)

## 9వ అధ్యాయం

శ్రీ గణేశాయ నమః

గొప్ప వాళ్ళ గొప్పదనం అల్పులతో పోల్చినప్పుడే గదా తెలిసేది! అసలు పతితులే లేకపోతే భగవంతుడు పవిత్రులుగా ఎవరిని మారుస్తాడు?

పరుసవేది ఇనుమును బంగారంగా మార్చగలదు. కనుకనే ఆ ఘనత. ప్రతి చిన్న కాలువను కూడా తనలో కలుపుకొని ముందరికి సాగగలదు కనకనే గోదావరికి ఆ ఘనత. ఘనత వహించిన ఓ దేవా! అంచేత యీ దీనుడైన దాసుగణును ఆదుకో స్వామీ!

షేగాంవ్‌లోని ఒక పాడు పడ్డ శివాలయాన్ని మోతే అనే ఒక వడ్డీ వ్యాపారి పునర్నిర్మాణం చేయించి దాని ప్రారంభోత్సవానికి గోవింద బువా తక్లీకర్ అనే ఒక హరిదాసుని కథ చెప్పటానికి పిలిపించాడు. ఆ రోజుల్లో పిలిచినచోటికల్లా హరిదాసులు గుర్రం మీద వెళుతూ ఉండేవారు. ఈ గోవింద బువాగారి గుర్రం చాలా మొరటుది. అది దగ్గరకు వచ్చిన వారిని తన్నటం, కొరకటం చేస్తూ ఉండేది.

గోవింద బువా తన గుర్రాన్ని గుడి ప్రాంగణంలో మామూలు తాడుతో ఒక చెట్టుకు కట్టివేశాడు. ఎప్పుడూ ఉపయోగించే ఇనుపగొలుసు మరచి రావటం వల్ల అలా చేశాడు. కీర్తన అయిన తరువాత పక్కనే ఉన్న వసతిలో పడుకున్నాడు. చీకటి దట్టమౌతున్న కొద్దీ గుడ్లగూబ మొదలైన పక్షుల అరుపులన్నీ ఆగిపోయాయి. గజానన మహారాజు బహుశా ఆ అల్లరి గుర్రాన్ని





సరిచేయటానికి కాబోలు అక్కడకు వచ్చి నిలబడి ఉన్న గుర్రం క్రింద ముడుచుకొని పడుకొని తమ మామూలు పాట


'గణ గణ గణాత్ బోతే' అని పాడటం ప్రారంభించారు. దీని అర్థం ఏమై ఉండవచ్చు? "ఓ మనసా నీవు ఈ విశ్వాత్మలోని భాగమేనని గ్రహించు" అనుకోవచ్చునేమో!

కొందరు ఆ పాటను "గిణ గిణ గిణతా బోతే" కావచ్చని అన్నారు. ఏమైతేనేమి స్వామి అంత రాత్రివేళ అక్కడ పడుకొని గుర్రాన్ని సాధువుగా మార్చటానికి మంత్రం వేస్తున్నట్లుగా ఉంది.

గోవింద బువాకు అంతగా నిద్రపట్టట్లేదు. గుర్రం ఉందో తాడు తెంపుకు పారిపోయిందోనని చూడటానికి లేచి వచ్చాడు. అద్భుతం! ఎప్పుడూ విపరీతంగా మసలుతూ ఉండే ఆ అల్లరిగుర్రం ప్రశాంతంగా నిశ్చలంగా నిలబడి ఉంది. అతడు దగ్గరకు వచ్చి చూచాడు. ఆ జంతువు క్రింద పడుకున్న మహారాజులను గుర్తించాడు. అర్థమైంది- శాంతిదాతయైన స్వామి సమక్షంలో ఆ గుర్రం ఎలా అశాంతితో ఉండగలదు! బువా స్వామిని పొగడ్తలతో ముంచివేశాడు. ఇంతవరకూ దాన్ని ఎవ్వరూ కొనకపోగా దానం ఇస్తానన్నా ఇష్టపడలేదు.

ఇక మీదట సౌమ్యంగా ఉండమని స్వామి ఆ జంతువును ఆదేశించి అక్కడ నుండి వెళ్ళిపోయారు. మరునాడు బువా ఆ గుర్రాన్నెక్కి స్వామి ఉంటున్న తోటకు వస్తే అక్కడ అందరూ ఆ పొగరుబోతు గుర్రాన్ని అక్కడకు తెచ్చినందుకు విసుక్కున్నారు. కాని 'స్వామి దయ వలన అది పూర్తిగా సౌమ్యంగా మారింది చూడమ'న్నాడు బువా. నిజంగానే అది పక్కనే ఉన్న పచ్చగడ్డినిగాని మొక్కలనుగాని ముట్టుకోకుండా ఉన్నచోటనే కట్టి వేయాల్సిన అవసరం లేకుండానే స్థిరంగా నిలబడిపోయింది. అదీ స్వామి మహిమ!

**(సశేషం)**



# షిర్డీసాయి చరితము

## గేయమాలిక

రచన : శ్రీ జయంతి భద్రం

(గత సంచిక తరువాయి)

8. పాము కాటుతో బాధను పడిన శ్యామానే రక్షించేవు
మూర్ఛ రోగి ఇరాని బాలిక వ్యాధి ఊదీతో తగ్గించేవు
భీమాజీకి కలలో వైద్యం చేసి క్షయను పోగొట్టేవు
నల్ల కుక్కకు పెరుగన్నముతో షింపీ జబ్బును బాపేవు
- నీ కృప ఉంటే విషము కూడా ఔషధమ్ముగా మార్చేవు ...(2)
॥సాయి॥

9. భక్తులందరూ ప్రేమతో చావడి ఉత్సవంబునే చేసేరూ
వారి కోరిక దీర్చుట కొరకూ ఊరేగింపుగ నడిచేవూ
రామనవమినీ, ఇదుల్ ఫితరును ఒక్కరీతిగా జరిపేవూ
- రామ్-రహీమ్ ఒకరేయన్న, సత్యమునే చాటించేవూ ...(2)॥సాయి॥

10. నీ చరితమ్మునే, హేమాదిపంతుచే, అణుకువగా వ్రాయించావు
కుష్ఠు రోగి భాగోజీనే, ప్రియ సేవకునిగ చేసేవు
భిక్షనిచ్చిన బయిజా బాయికి, ముక్తినిచ్చి కరుణించేవు
సేవలు చేసిన లక్ష్మీబాయికి, తొమ్మిది రూకలనిచ్చేవు
- నవవిధ భక్తికి ప్రతిఫలమిదియని అందరికీ బోధించేవు...(2)
॥సాయి॥

11. నానాసాహెబు చందోర్కరుకు గీతాసారము తెల్పావూ
డాక్టరు పండిట్ గురువు రఘునాథ మహారాజుగ కన్పించేవు
మూళేశాస్త్రికి గోలప్స్వామిగ దర్శనమిచ్చీ బ్రోచావు
కాకాసాహెబు విఠలుని రూపం స్థిరముగ మదిలో నిలిపావు
- సమాధి నుండే పలుకుదునేనని అభయమిచ్చి దీవించేవు...(2)
॥సాయి॥

(సశేషం)





ఓం శ్రీ సాయిరాం



# షిరిడీ డైరీ

- మాన్యశ్రీ జి.ఎస్. కపర్డే

అనువాదం : మాతా శుకవాణి

(గత సంచిక తరువాయి)

01-02-1912

లేవటం కొద్దిగా ఆలస్యమైందిగానీ, నా ప్రార్థనా అవీ పూర్తి చేసుకొని పరమామృతం క్లాసుకు వెళ్లగలిగాను. ఆ గ్రంథం యివ్వేళ పూర్తయింది. రేపు దీన్ని పునర్విమర్శ చేస్తాము. అప్పుడు నేను సాయి మహరాజును చూడటానికి వెళ్లి, ఆయనతో సాఠే వాడా దాకా నడిచాను. జనం అక్కడ సమావేశమై ఉన్నారు-సాయికి నమస్కారం చేయడానికి. నేను కూడా వారితో కలిసి నమస్కరించుకొని బాపూసాహెబ్ యింటికి వెళ్లి, పంచదశి ప్రారంభం చేసి తొలి పది శ్లోకాలు - అసలవే మొత్తానికి సారభూతమైనవి - వివరించాను. తరువాత విడిదికి వచ్చి కొన్ని ఉత్తరాలు వ్రాసి పంపించేసాను. తరువాత మసీదుకు వెళ్ళి మధ్యాహ్నారతికి హాజరయ్యాను. అది బాగానే నడిచింది. అహమ్మద్‌నగర్‌కు చెందిన మాణిక్యచంద్- ఈ ఏడే బి.ఏ, ఎల్.ఎల్.బి. చేసాడు-రోజంతా ఇక్కడే ఉన్నాడు. హారతి నుండి వచ్చాక సఖ్రేబువా వ్యాఖ్యానించిన జ్ఞానేశ్వరి చదివాను. దుర దృష్టవశాత్తు యిది నా ఇబ్బందులను పరిష్కరించలేదు. దీక్షిత్ రామాయణం చదివాడు. షిరిడీ మామ్లేదార్ సోనే, కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్, సబ్ డివిజనల్ ఆఫీసరు వస్తే కాస్సేపు మాట్లాడుతూ కూర్చున్నాం. మా రామాయణం మళ్లీ మొదలెట్టాం వాళ్లు వెళ్లిపోయాక. సాయంత్రం వేళ సాయిని చూడటానికి మసీదుకు వెళ్లాను. వాడా హారతి

తరువాత శేజారతికి వెళ్లాను. భీష్మ భజన జరగలేదు. సఖారాం ప్రాకృత భాగవతం చదివాం. రాత్రి దీక్షిత్ రామాయణం చదివాడు. ఇవ్వేళ సాయంత్రం సాయిబాబా వాహ్యాళికి బయలుదేరే ముందర మేమంతా నిలబడి ఉండగా సాయిసాహెబ్ ఆ సమయంలో తన కాళ్లకు నూనె రాస్తున్న నా భార్యకు రెండు వందల రూపాయలిమ్మని దీక్షిత్‌కు చెప్పాడు. ఈ ఆజ్ఞ పాటించరానిది. నేను చందాల మీద బ్రతకటానికి వచ్చానా? ఇంతకంటె చావటం మేలు. సాయిసాహెబ్ నా అహంకారాన్ని సంపూర్ణంగా నాశనం చేయదలచుకున్నారేమో! నన్ను పేదరికానికి యితరుల దయాధర్మాలకూ అలవాటు పడేట్లు చేయదలచుకున్నారేమో!

పి.ఎస్:- ఈ పేజీ మరోసారి చదివితే ఆ భావాలు చాలా సరైనవనిపించాయి. బాబా సర్వాంతర్యామి. ఆయన నా హృదయాంతరాళాలలోని విషయాలన్నీ గ్రహించ గలిగారు. అందుకే తమ ఆజ్ఞ అమలుపరిచితీరాలని నొక్కి చెప్పలేదు మళ్లీ. అప్పట్లో నా భార్యకు పేదరికం, శారీరక శ్రమయిష్టం లేవని నాకు అర్థమవుతోంది. అందుకే బాబా పేదరికం, ఓర్పు అనే రెండు వందల రూపాయలు ఆమెకిమ్మన్నారు.

02-02-1912

నేను లేచి కాకడ హారతికి వెళ్లాను. అటుపైన పంచదశి క్లాసుకు వెళ్లాను. దాన్ని గురించి మాట్లాడాలనిపించింది. చదవటం ప్రారంభించాము. ఈ విషయం పైన ఇంతకన్నా గొప్ప గ్రంథం లేదు. సాయి మహరాజు బయటికి వెళ్లకముందే ఆయన దగ్గరికి వెళ్లాను. ఆయనతో సాఠేవాడా వరకు నడిచివెళ్లాను. తరువాత మధ్యాహ్న హారతిలో పాల్గొన్నాను. అమరావతి నుండి తిరిగి ప్రాక్టీసుకు రమ్మని ఉత్తరం వచ్చింది. అనుమతి కోసం బాబా నడగమని మాధవరావు దేశ్‌పాండేను కోరాను. అతను సరేనన్నాడు.

**(సశేషం)**





# సాయిధామంతో మేము....

**- శ్రీమతి కన్యక, సౌమనస్య సత్సంగ శాఖ**

మొదట మేము సాయిధామానికి ఎలా అడుగుపెట్టామో వ్రాయాలి. 2011 నవంబర్‌లో భాస్కరరావు నగర్ కాలనీ నుండి 15మందిమి కీసరగుట్ట వెళ్ళాము. అది కార్తీకమాసం. దీపాలు వెలిగించి తిరుగు ప్రయాణంలో భోజనాలు ఎక్కడ చేద్దామని ఆలోచించాము. మేమే అన్నీ తెచ్చుకున్నాం. సాయివాణి ద్వారా తెలుసు కనుక నేను "దారిలో సాయిధామం ఉంది. అక్కడ భోంచేసి ఆశ్రమం చూసి వెళదాం" అని అన్నాను. అక్కడ ఎవరు ఉంటారన్నదీ, ఆశ్రమ వివరాలు పెద్దగా తెలియవు. అయినా అందరం వెళ్ళాము. గేటు లోపలికి రావడంతోనే ఉసిరిచెట్టు, అక్కడ దీపాలు వెలుగుతూ కనిపించాయి. దూరంగా గురువుగారు కూర్చొని ఉన్నారు. మేము కూడా ఉసిరిచెట్టు కింద దీపాలు పెట్టుకొని, భోంచేసి, ఆశ్రమానికి వెళ్ళాము. అక్కడ గురువుగారు తమ కుర్చీలో ఉన్నారు. ఎప్పుడు వెళ్ళి అక్కడ కూర్చున్నారో మేము గమనించనే లేదు. అయ్యో! నమస్కారం అయినా చేసుకోకుండా భోజనం చేసామే అని బాధపడ్డాము.

తరువాత మాతాజీ అందరినీ అడిగారు-ఎక్కడ ఉంటారు? అని. వివరాలన్నీ చెప్పాం. గురువుగారు అందరి పేర్లు అడిగిన తరువాత "పారాయణ చేస్తూ ఉండండి" అని సత్సంగ మహిమ గురించి వివరించారు. 'ఎవరు చేస్తారు చేతులెత్తండి" అని అన్నారు. అందరం ఆనందంగా చేతులెత్తి 'వచ్చే వారమే మొదలుపెడతాం' అని అన్నాం. మాతాజీ కూడా 'అప్పుడప్పుడు నేను వస్తాను' అన్నారు. అన్నట్లే రెండువేల పదకొండు నుండి ఇప్పటి వరకు సత్సంగం చక్కగా జరుపుకొంటున్నాం.

హనుమజ్జయంతి, గురుపూర్ణిమ, గీతా జయంతి, నవరాత్రులు ఇలా అప్పుడప్పుడూ మాతాజీని పిలుచుకొంటాము. ఇటీవల భాగవత పారాయణ పూర్తి అయింది. “మాతాజీ, ఒకరోజు వస్తారా?” అంటే వెంటనే జనవరి మొదటి వారంలో వచ్చి రెండు గంటలు భాగవతంలోని అనేక విషయాలు వివరణతో చెప్పారు. మాకు రెండు నిముషాలుగా అనిపించింది. వాటిలో చిన్నమ్మగారి కథ మమ్మల్ని కదిలించివేసింది. భోజన సమయం అయింది. మాతాజీతో కలిసి భోజనం చేసాం. మా సత్సంగానికి మాతాజీ “సౌమనస్య సత్సంగ్” అని పేరు పెట్టారు. ఎప్పుడు వచ్చినా మాకు మంచి విషయాలు చెప్తూ, ఆశ్రమం కబుర్లు కూడా చెప్పి వెడతారు.

ఉత్సవాలకు ఆశ్రమానికి వెళ్లడంతో పిల్లలు, పెద్దలతో బంధం పెరిగింది. సంక్రాంతి పండుగ ముందు ఫోన్ చేసి “యింతదాకా సత్సంగాల్లో మీరు విన్న వాటిలో మీ మనసు మీద ప్రభావం చూపిన విషయాలు వ్రాసి పంపు” అన్నారు. అసలు ఒక్క అక్షరం అన్నా వ్రాయగలనా? పెద్దగా అక్షర జ్ఞానం లేనిదాన్ని - అని అనుకుంటూ కలం తీసుకున్నాను. అంతా ఆయనే నడిపి, సాయి తండ్రి యీ పేజీ నింపారు. ఇప్పుడు ఊపిరి పీల్చుకుంటాను. అమ్మయ్య! కాని మాతాజీకి ఇది అర్థమయితే నేను ధన్యురాలిని. మరోసారి సత్సంగాలలో మేము నేర్చుకొన్న వాటిని వ్రాసే ప్రయత్నం చేస్తాను.

సెలవు,
గురుదేవులకు నమస్సులతో,
మీ, కన్యక

**నా గొప్ప నేనే చెప్పుకోవటం అల్పత్వం**
**ఇతరులు చెప్పుకోవటం ఔన్నత్యం**







# ఆశీరక్షతలు



శ్రీ ముసునూరి యోగానంద్‌గారు మా సంస్థ ట్రస్ట్ బోర్డు మెంబరు రామమోహనరావుగారి తమ్ముడు. గురుదేవుల ఆశీర్బలంతో శ్రీ సాయి పారాయణ ఫలంగా వారి కుమార్తె చి॥సౌ॥ రమ్యకృష్ణ వివాహం చి॥ వీరయ్యచౌదరితో ఫిబ్రవరి 7వ తేదీ రాత్రి 12 గం. 21ని.లకు కుక్కట్ పల్లిలోని భ్రమరాంబా మల్లికార్జున ఫంక్షన్ హాల్‌లో శాస్త్రోక్తంగా వైభవంగా జరిపించారు. వధూవరులు దైవభక్తి, దేశానురక్తీ, సేవాసక్తీ కలిగి, తామేకాక తమ పుత్రికా పుత్ర సంతతిని కూడా లోకోప కారకులుగా తీర్చిదిద్దాలని గురుదేవులు ఆశీస్సులిస్తున్నారు.

శ్రీ సాయి విద్యాధామం పాఠశాల పూర్వ విద్యార్థి చి॥ శ్రీవాణిది హాజీపురం గ్రామం. ఆమె అన్న శ్రవణ్ కూడా యిక్కడి విద్యార్థే. వాళ్ల తల్లిదండ్రులు శ్రీమతి దాసరి హంసమ్మ, శ్రీ చంద్రారెడ్డి గారలు తమ కుమార్తె చి॥ శ్రీవాణికి చి॥ గణేశ్‌రెడ్డితో ఫిబ్రవరి 8వ తేదీ ఉదయం గం.10.41 ని.లకు వివాహ మహోత్సవం వైభవంగా జరిపించారు. నవ దంపతులు పరస్పర అవగాహనతో కలకాలం సంతోషంగా జీవించి, సత్సంతానవంతులై, లోకోపకారకులై జీవింతురు గాక!- అని సాయివాణి ద్వారా ఆశీస్సులు అందిస్తున్నారు ఆశ్రమం వారు.

శ్రీ గుమిడెల్లి ఈశ్వరయ్యగారు జంట నగరాలలో సుప్రసిద్ధ వ్యాపా రులు. వారి కుమారులందరూ సాయిధామం ఆశ్రమానికి చాలా సన్నిహితులు శ్రీ విజయకుమార్‌గారు, శ్రీ విశ్వేశ్వరంగారు, శ్రీ సురేశ్ గారు అంతా ఆశ్రమానికి వస్తూ పోతూ ఉంటారు కూడా. సాయి సేవా సమితి ట్రస్ట్ వారి ఆశ్రమాలు మూడింటి (సాయిధామం,

సాయినాథ క్షేత్రం, సాయి సన్నిధానం) నిర్మాణంలోనూ వారి సేవా హస్తం ఉంది. విజయకుమార్‌గారి చేతుల నుండి వచ్చే బట్టలతోనే సాయిబాబా వారు అలంకృతులవుతారు ప్రతి దసరా ఉత్సవాలలోనూ. అలాంటి సన్మిత్రుల యింట ఫిబ్రవరి 8వ తేదీన వివాహ మహోత్సవం జరిగింది. శ్రీ సురేశ్‌గారి జ్యేష్ఠ పుత్రుడు చి॥ సాయిసుమంత్ వివాహం చి॥సౌ॥ శ్రావ్యతో ఉదయం గం.10.41 ని.లకు అత్యంత వైభవంగా, శాస్త్రోక్తవిధిన జరిగింది. నవ వధూవరులు కలకాలం అన్యోన్యంగా జీవించి, సత్సంతానవంతులై, తమ బిడ్డలు కూడా తమ పెద్దల అడుగు జాడలలో మంచి సంస్కారవంతులుగా, సమాజ చింతన గల సేవా పరులుగా రూపొందేలాగా పెంచి ధన్యులగుదురు గాక- అని పరమ పూజ్య గురుదేవులు ప్రేమాశీస్సులు అందిస్తున్నారు.

# ఆనందం

**- ప.పూ. శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారు**

చాలాకాలం క్రిందటిమాట. ఒకానొక మారుమూల గ్రామంలో ఒక బీద రైతు ఉండేవాడు. ఒంటరివాడు. కూలీనాలీ చేస్తూ ఎలాగో కష్టపడి జీవనం వెళ్ళదీస్తున్నాడు. ఆ ఊళ్ళో ధనవంతుల్ని చూసి 'వాళ్ళెంతో సంతోషంగా ఉన్నారే - తనకా సంతోషం లేకపోయెనే' అని బాధపడుతూ ఉండేవాడు.

ఒకసారి ఒక సిద్ధుడు పర్యటన చేస్తూ ఆ ఊరి దగ్గర ఆగాడు. ఈ మన బీదవాడు ఆయనను దర్శించి కాళ్ళమీద పడి "స్వామీ నేను ఆనందంగా ఉండటానికి ఏదైనా మంత్రోపదేశం చేయండి" అని ప్రాధేయ పడ్డాడు. అతడు అడిగిన దానికి ప్రతిగా ఆ స్వామి ఒక మంత్రాన్ని





ఉపదేశించి "దీన్ని నిష్ఠగా జపించు. దేవత ప్రత్యక్షమై నీ కోరిక తీరుస్తుంది" అన్నారు.

చాలా బాధల్లో ఉన్న ఆ రైతు పరిష్కారం దొరికిందని సంతోషిస్తూ శ్రద్ధగా జపాన్ని కొనసాగించారు. అతని తపో తీవ్రతకు మెచ్చి దేవత ప్రత్యక్షమై "నాయనా! నీకేం కావాలో కోరుకో" మన్నది.

ఆ రైతు బోలెడు సంబరపడిపోయి "తల్లీ! నా అవసరాలన్నీ తీరేటంత ధనం నాకు ప్రసాదించు" అని ప్రార్థించాడు. ఆ దేవత వరాన్ని ప్రసాదించింది. ఆ మనిషి ఆ ధనం చూసుకొని ఆనందంతో తబ్బిబ్బు అయిపోయినాడు. ఆ డబ్బుతో ఇళ్ళు, వాకిళ్ళు, పొలాలు, బండ్లు, ఇంటెడు సామాను, రకరకాల ఆహారపదార్థాలు సమకూర్చుకున్నాడు. కొంతకాలం పాటు ఆనందంగానే ఉన్నాడు. కాని కొద్దిరోజుల్లోనే ఏదో వెలితి అతన్ని బాధపెట్టసాగింది. ఆనందం క్రమంగా తరిగిపోసాగింది.

అతడు మళ్ళీ దేవత కోసం తపస్సు చేశాడు. దేవత ప్రత్యక్షమై "ఏం కావాలి నాయనా?" అని ప్రశ్నించింది. "అమ్మా! ఈ సంపదనంతా నాతో కలిసి అనుభవించటానికి నాకొక కుటుంబము, బంధువులు, స్నేహితులు కావాలి. ఒంటరిగా దీన్ని ఆనందించలేకపోతున్నాను" అన్నాడు. ఆ దేవత "సరే" అన్నది. ఆ వ్యక్తికి ఇప్పుడు అంతులేని ఆనందం కలిగింది. కుటుంబంతోనూ, బంధు మిత్రులతోనూ ఆనందంగా కాలం గడుస్తున్నది కాని క్రమంగా మళ్ళీ ఏదో వెలితి. ఆనందం తరిగిపోతున్నది.

మళ్ళీ దేవతను ప్రార్థించాడు. ఆమె కన్పించగానే "అమ్మా! సంపదలు, బంధుమిత్రులు ఉన్నాగాని నాకు మంచి ఆరోగ్యం లేకపోవటం వలన నేను పూర్తిగా ఆనందాన్ని అనుభవించలేకపోతున్నాను. దయచేసి మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించు" అని ప్రాధేయపడ్డాడు. ఆ దేవత "సరే"నన్నది. ఇంకేం ఆనందమే ఆనందం. కొద్దిరోజుల్లోనే మళ్ళీ వెలితి. ఈ తడవ దేవత ప్రత్యక్షమైనప్పుడు -

"అమ్మా! సంపదలూ, కుటుంబమూ, మంచి ఆరోగ్యమూ ఉన్నాయి కాని మంచి పేరు, కీర్తి, అధికారము లేకపోవటం వలన నాకు ఆనందం కలగటల్లేదు. వాటిని ప్రసాదించు తల్లీ!" అన్నాడు. హఠాత్తుగా అతడికి కీర్తి ప్రతిష్ఠలు వచ్చాయి. జనం అతనిచుట్టూ మూగటం ప్రారంభించారు. అతడు ఎంతో ఆనందాన్ని అనుభవించటం ప్రారంభించారు. కొద్దిరోజుల్లోనే అతన్ని తిరిగి విచారం అలముకోవటం ప్రారంభించింది. మళ్లీ దేవతను ప్రార్థించాడు.

"ఈ తడవ ఏం కావాలి నాయనా?" అని ఆ దేవత ప్రశ్నించింది. "అమ్మా! నాకు చదువు సంధ్యలు లేవని, తెలివితేటలు తక్కువ అని ప్రజలు నా వెనకాల ఎగతాళి పట్టిస్తున్నారు. అవి ఉంటేనేగాని నాకు పూర్తి ఆనందం కలదు. వాటిని ప్రసాదించు తల్లీ" అన్నాడు.

ఆమె "తథాస్తు" అన్నది.

ఇప్పుడు అతనికి సంపదలు, మంచి కుటుంబము, బంధుమిత్రులు, మంచి ఆరోగ్యము, కీర్తి ప్రతిష్ఠలు, విద్యలు, తెలివితేటలు- అన్నీ ఉన్నాయి. కాని ఏదో వెలితి. ఆనందం క్రమంగా కరిగిపోతున్నది. మళ్ళీ దేవతను ప్రార్థించాడు. ఆమె ప్రత్యక్షమైంది.

"అమ్మా! నాకు నీవు ఇన్నింటిని ప్రసాదించినా ఏదో లోటు కన్పిస్తూనే ఉంది. ఆనందం కరిగిపోతున్నది. అలా ఆనందం తరిగిపోకుండా ఉండాలనే నా కోరిక" అన్నాడు. అప్పడా దేవత "నాయనా! నీ కోరికలే ఆనందం కరిగిపోవటానికి కారణం. బొమ్మ వెనకాల బొరుసు ఉన్నట్లు కోరిక వెనువెంటనే దుఃఖమూ తరుముకుంటూ వస్తున్నది. ఎప్పుడు నీకు కోరికలు లేకుండాపోతాయో, ఉన్నదానితో తృప్తి ఎప్పుడు కలుగుతుందో- ఇక కోరికల కోసం నన్ను తలుచుకోవటం ఎప్పుడు మానివేస్తావో అప్పడే నీ దగ్గర ఆనందం నిలుస్తుంది" అని అదృశ్యమైంది.



సాయి వాణి

# DECLARATION

Statement about ownership and other particulars about **"Sachidananda Sadguru Sai Vani".**

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | Hyderabad |
| 2. | Periodicity of publication | : | Monthly |
| 3. | Printer's Name | : | V.V. Krishna Rao |
| | Nationality | : | Indian |
| | Address | : | Sai Sri Printers, 8-3-945, Shop No. 21, Pancom Business Centre, Ameerpet, Hyderabad - 500 016 (A.P.) |
| 4. | Publisher's Name | : | Mata Sukavani |
| | Nationality | : | Indian |
| | Address | : | Saidhamam, Nalgonda Dist, Pin - 508 126 |
| 5. | Editor's Name | : | Mata Sukavani |
| | Nationality | : | Indian |
| | Address | : | Saidhamam, Nalgonda Dt, Pin- 508 126 |
| 6. | Owner's Name | : | Sai Vani Publications, Saidhamam, Nalgonda Dist - 508 126 |

I, Mata Sukavani declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 01-03-2015

Sd/-

Mata Sukavani

# మాతృసంస్థ కబుర్లు

జనవరి 25వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు సాయిధామంలోని 'ఆరోగ్య' ప్రకృతి వైద్యశాలను పునఃప్రారంభించడం జరిగింది. (రెండేళ్లుగా కారణాంతరాల వలన అది ఫంక్షనింగ్‌లో లేదు-మూసి ఉంచాము.) డా॥ కృష్ణచైతన్యగారు శ్రీ సాయిబాబా ఆశీస్సులతో డ్యూటీ తీసుకున్నారు. శ్రీ సాయికి దీపారాధన చేసి లఘుపూజ చేసిన తరువాత శ్రీ రామయ్య గారు కొబ్బరికాయ కొట్టగా డాక్టరుగారు హారతిచ్చారు. పరమపూజ్య గురుదేవులు విభూతి చల్లి ఆశీర్వదించారు.

జనవరి 25వ తేదీన పదిగంటలకు సాయివాణి రజతోత్సవం. ఆ సందర్భంగా సాయిధామంలో ఆప్తులతో ఒక సమావేశం ఏర్పాటైంది. చిరకాల అభిమానులు, కొందరు పాఠకులు, ముద్రణ నిర్వాహకులు అంతా వచ్చారు. ఆ రోజు పెళ్లి ముహూర్తాలు, స్వైన్‌ఫ్లూ భయంతో విందులు, వినోదాలకు రాలేని వారిని మినహాయించినాగానీ గుడి నిండేలాగానే జనం వచ్చారు. కొద్ది భజన తరువాత కార్యదర్శి నివేదిక వినిపించారు ప్రధాన సంపాదకురాలు శుకవాణి. గౌరవ సంపాదకులు శ్రీశ్రీశ్రీ గురుదేవులు సాయివాణిని ప్రారంభించిన లక్ష్యాన్ని వివరించి, సహకరించిన వారందరికీ ఆశీస్సులు అందజేసారు. పత్రికపై తమ అభిప్రాయాలను, అనుబంధాన్ని వివరిస్తూ ప్రూఫ్‌రీడింగ్‌తో సాయివాణిని రెండేళ్లు సేవించుకొన్న శ్రీ భేరి సోమన్నగారు, చిరకాల మిత్రులు శ్రీ సోమన్న జూనియర్ (ఈ పేరు ఆయనే పెట్టుకున్నారు), శ్రీ గడ్డం నరసింహారెడ్డిగారు, శ్రీ ఎడ్ల నారాయణరెడ్డిగారు (తీవ్ర అనారోగ్యాన్ని లెక్కచేయకుండా వచ్చి మా కోరిక తీర్చారు) మాట్లాడారు. తదుపరి శ్రీ సాయి మామ్మగారు





(తొంభయ్యవ పడిలో సగం దాటారు) వ్రాసిన అభిమానలేఖ చదివి వినిపించాడు రాంబాబు. అటుపైన శ్రీ వి.వి. కృష్ణారావుగారినీ (సాయిశ్రీ ప్రింటర్స్ అధినేత- సాయివాణికి దత్తత తండ్రి), వారి శ్రీమతి గారినీ సాయిధామం హార్దికంగా సత్కరించుకొన్నది. చివరికి మహాహారతితో సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో ప్రధానంగా గుర్తుంచుకోవలసినవి రెండు విషయాలు. మొదటిది-ప్రతివారూ కనీసం మరో ఐదుగురు సభ్యులను చేర్చి బలం పెంచుకోవాలన్నది. రెండవది-ఇంతవరకూ కేవలం డి.టి.పి. చేయించడం, ప్రెస్సుకివ్వడం, పుస్తకాలు తెచ్చి పోస్ట్ చేయడాలకే పరిమితమైన రాంబాబు గారు ఇకపై రచనా విభాగాలలో కూడా తీవ్రంగా పరిశ్రమించవలసిన అవసరం ఉన్నది గనుక శ్రద్ధ వహించాలన్నది. ఈ సాయివాణి నూరేళ్ల పండుగలెన్నో చేసుకోవాలన్న అభిమానుల ఆకాంక్ష తీరాలంటే యిది తప్పదు- తరువాతి తరాల వారు రంగంలోకి దిగవలసిందేనన్నది ఏకగ్రీవ తీర్మానం. అటుపై భోజనాలు చేసి అభిమానులంతా తరలివెళ్లారు. పొరుగూళ్ల నుంచీ వచ్చి కార్యక్రమాన్ని సంపన్నం చేసిన అభిమానులనూ, సహకరించిన పాఠశాల చిన్నారులనూ సాయివాణి అభినందిస్తున్నది.

జనవరి 26వ తేదీ గణతంత్ర దినం. ఉదయం తొమ్మిదిగంటలకు శ్రీ సాయి విద్యాధామం పిల్లలంతా భారతమాత స్తవం చేస్తూ వెళ్లి భరత మాత మంటపం దగ్గర నమస్కారం చేసి వచ్చారు. తదుపరి పతాకావిష్కరణ శ్రీ బి.గోపీకృష్ణగారి చేతులతో జరిగింది. పిల్లలు దేశభక్తి గేయాలు వినిపించారు. పరమపూజ్య గురుదేవులు భారత స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకోవలసిన అగత్యం గురించీ, పద్ధతి గురించీ చెప్తూ, మన భూమి సంస్కృతీ సంపన్నమైనదనీ, కాలక్రమాన వికృతికి లోనవుతున్నదనీ వివరించారు. ఆ సందర్భంగా ప్రకృతి, వికృతి, సంస్కృతులకు మధ్య గల

భేదాన్ని సోపమానంగా విశ్లేషించి చెప్పారు. అటుపైన అందరూ 'సాయి కళ్యాణి' ఆడిటోరియమ్‌లో చేరారు. ఆ రోజు భరతమాతకు ప్రతీకలుగా తల్లులను ఆహ్వానించి మాతృపూజ నిర్వహింపజేయటం సంప్రదాయం పాఠశాలకు. అంచేత తల్లులు వచ్చి ఉన్నారు. వారందరినీ కుర్చీలలో ఆసీనులను చేసారు. పిల్లలు వాళ్ల చెంత కూర్చున్నారు. తల్లులకు పాదపూజ చేసి పసుపుకుంకుమలిచ్చారు. అష్టోత్తర శతనామ పూజ చేసారు. పుష్ప సమర్పణ చేసి, సాష్టాంగ నమస్కారాలు చేసారు. తమను నవమాసాలు మోసి, బొడ్డుపేగు ద్వారా ఆహారమిచ్చి, కని, పెంచినందుకు కృతజ్ఞతలు చెప్పుకున్నారు. తెలిసీ తెలియకా తాము చేసిన దుశ్చేష్టలను, అన్న దుడుకు మాటలను క్షమించమని ప్రార్థించారు. కుటుంబానికీ, తల్లిదండ్రులకూ, జాతికీ, ధర్మానికీ చెడు కల్గించేవేవీ చెయ్యబోమనీ, అటువంటి శక్తి సామర్థ్యాలు తమకు కలిగేలా ఆశీర్వదించమనీ తల్లుల పాదాలంటి వేడుకున్నారు.

పూజ చేయిస్తూ భారతమాతను గుర్తు చేస్తూ వచ్చారు మాతాజీ. ఆశ్రమ బాలబాలికలు భారతాంబనే తల్లిగా భావించి పూజించారు. తరువాత గురుదేవులు మాతృ విశిష్టతను గూర్చి ప్రవచించారు. అటుపైన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వివిధ రకాల ఆటల పోటీలలోను, సాంస్కృతిక పరమైన పోటీలలోను, ముగ్గుల పోటీలలోను గెలుపొందిన వారందరికీ శ్రీ కె. చంద్రారెడ్డిగారి చేతుల ద్వారా బహుమతి సమర్పణ జరిగింది. ఉపాధ్యాయులు బహుమతులు అందుకొంటున్నపుడు పిల్లలు మహోత్సాహంతో కరతాళ ధ్వనులు చేసి తమ ఆనందాన్ని వెలిబుచ్చారు. ఈ ఉత్సవానికి బహుమతులు కొని తెచ్చేందుకై తన వాటా సేవగా బేగం బజారు వెళ్లి వచ్చిన డాక్టర్ కృష్ణచైతన్యగారికి, మాతృపూజకు వచ్చిన తల్లులకు ప్రత్యేకాభినందనలు దక్కాయి. చివరగా పిల్లలు, పెద్దలు - అందరూ సాయి ప్రసాదాలు ఆరగించి వెళ్లారు.





# చిట్టి గురువు

**- మాతాజీ**

ఏడెనిమిదేళ్లుంటాయి ఆ అమ్మాయికి. సన్నగా, తెల్లగా, కాస్త పాతబడిన గౌనులో ఉంది. "ఆ ఎర్ర గులాబీల గుత్తి ఎంతకిస్తావు?" అని అడిగింది పూల దుకాణం అతన్ని.

"ఏదీ? యిదా? ఐదు రూపాయలు" అన్నాడతను.

"అమ్మో!" గుండెమీద చెయ్యి వేసుకున్నది పాప.

"రెండు రూపాయలకివ్వవా?"

"రాదు, పో"

పాప ముఖం చిన్నబోయింది. చేతిలో ఉన్న డబ్బులు చూచుకొని, నిరాశగా వెనక్కు తిరిగింది. మా అమ్మగారి కోసం పూలదండ తీసుకోవాలని వచ్చాను నేను. ఆ పాప నిరాశ నిండిన కళ్లు చూచి నా గుండెలో కలుక్కుమన్నట్లయింది.

"నీకు ఎర్ర గులాబీలు ఇష్టమా, పాపా!" పలకరించాను.

పాప నావైపు చూచి "నాకు కాదండీ, మా అమ్మకిష్టం" అన్నది. ఒక్క క్షణం ఆగి "ఇవ్వేళ మా అమ్మకివ్వాలనుకొన్నాను". పాప కళ్లు చెమ్మగిల్లాయి. "నేను కొనిస్తాను తీసుకువెళ్లి మీ అమ్మకివ్వు" అన్నాను చిరునవ్వుతో. మెల్లగా తలఊపింది పాప-కొద్దిగా సంకోచిస్తూ. నేనొక మంచి గులాబీల గుత్తి కొని పాపకిచ్చి, నేనో పెద్ద దండ కొనుక్కొన్నాను. ఇంతలో పాప ప్రక్కనున్న కొట్లో ఏవో కొనుక్కొని బయటకు వచ్చింది. నేను స్కూటరు స్టార్టు చేస్తూ - "నువ్వెటు వెళ్లాలి?" అని అడిగాను. చేత్తో చూపించింది.

"నేనూ అటే వెళ్లాలి దింపేస్తాను రా!" అన్నాను. సంతోషంగా ఎక్కి కూర్చుంది. ఓ కిలోమీటరు వెళ్లాక బండి ఆపాను.

"పాపా! రెండు నిమిషాల్లో వెడదాం. ఏం!" అంటూ బండి దిగాను. పాప కూడా దిగింది. నాకన్నాముందే గబగబా లోపలికి నడిచింది.

నేను పూలదండ తీసుకొని లోపలికి నడిచాను. పాప ఒక చిన్న సమాధి దగ్గర ఆగింది. చుట్టూ తిరిగి నమస్కారం చేస్తోంది. ప్రదక్షిణ అయ్యాక తన సంచిలోంచి అగ్గిపెట్టె, అగరువత్తులు తీసింది. ఇందాక కొట్లో కొన్నది అవేనేమో! అగరుబత్తులు వెలిగించే ముందు ఆ సమాధి అంతా శుభ్రంగా రెండు చేతులతో దులిపింది. అగరువత్తులు వెలిగించి మట్టిలో గుచ్చింది. అప్పటిదాకా మౌనంగానే ఉన్నదిగానీ, పాప చేతులిప్పుడు కొంచెం వణుకుతున్నాయి. పూలగుత్తి రెండు చేతులతో పట్టుకున్నది. సమాధి మధ్యలో దాన్ని పెడుతూ-"అమ్మా, నీకిష్టం గదా! తీసుకోమ్మా!" అంటూనే బావురుమన్నది. వెక్కిళ్లు పెట్టి ఏడుస్తూ సమాధికి తలఆనించి నేల మీద కూలబడింది. రెండు నిముషాల అలా చూస్తూ ఉండిపోయి, ఆ పొంగు కాస్త చల్లారాక-మెల్లగా పాప తల మీద చెయ్యి ఉంచి నిమిరాను. పాప వెనక్కు తిరిగి చూచింది. అప్పటిదాకా నేను అక్కడున్నా నన్న స్పృహలేనట్లు చూచింది. వేలితో సమాధికేసి చూపిస్తూ "మా అమ్మ..... మా అమ్మ....."అని మళ్లీ బావురుమన్నది. నేనామెను దగ్గరకు తీసుకున్నాను. "ఊరుకోమ్మా-ఊరుకో! ఇదుగో యీ పెద్ద దండ కూడా మీ అమ్మకే వేద్దాం-ఏం?" అంటూ నా చేతిలోని దండ కూడా పాపచేత ఆ సమాధి మీదే వేయించాను. నిజానికి నేను కూడా ఆ పని మీదే వచ్చాను. కానీ, అలవాటుగా ఏటా వచ్చినట్లే మా అమ్మ పోయిన రోజు గనుక ఓ పుష్పార్చనతో ఋణం తీర్చుకోవాలన్నట్లు యాంత్రికంగా వచ్చాను. డబ్బుంది గనుక పెద్ద దండ కొన్నాను. అంతేగానీ ఆ పాపలో ఉన్న సహజప్రేమ, గాఢత నాలో లేవు. నాకు సిగ్గు, బాధ కలిగాయి. ఎక్కడో గుండెలోతుల్లో తడి తగిలింది. పాపతోబాటు ఆమె మాతృస్మృతికి నమస్కారం చేసాను. "వెడదామా!" అంటే తలూపింది పాప. యాంత్రిక జీవనంతో నాలో ఆరిపోయిన సున్నితత్వాన్ని, తపనను నిద్రలేపిన నా చిట్టిగురువు పాప. ఇప్పుడు నేను ఇంటికి వెళ్లి, నా భార్యాపిల్లలతోసహా మళ్లీ వస్తాను- నా మాతృమూర్తి పవళించిన చోటికి. పాప నాకు గురువైంది యీ విషయంలో.





# నదీ, ఓ నదీ !

**- కె. శిల్ప, తొమ్మిదవ తరగతి**

జీవితం అనే ఈ సంద్రంలో
మనమందరం చిన్న నదులమే
నది పుట్టగానే గెంతుతుంది చిన్న పిల్లాడిలా -
దూకుతూ ప్రవహిస్తుంది నీటి వాగులా.
నదీ నువ్వు అల్లరి చేస్తావు అల్లరి పిల్లాడిలా -
కానీ పోస్తావు ప్రాణాలు దేవుడిలా.
యువకుడిలా పరుగెడుతూ ఆడుతూ పాడుతూ వెడతావు
ఎన్నో అద్భుతాలను అందాలను చూస్తావు
ఎన్నో పంట చేలను తడుపుతూ
ఎన్నో గొంతులను తాకుతూ
ఓ నదీ, ప్రవహించవా మా సీమలో!
పాలయేరువై పొంగించవా మా సిరులను!
ఎన్నో కాలువలకు తోడుంటావు తండ్రిలా
వాటిని కంటిరెప్పలా చూస్తావు తల్లిలా
కోపమొస్తే మాత్రం ఉప్పొంగిపోతావు
ఊళ్లకు ఊళ్లే నిలువునా ముంచేస్తావు
కష్టాలు అనే అలలు ఎదుర్కొంటూ -
జీవితమనే ప్రయాణాన్ని సాగించుకొంటాము మేము.
నీకే లేని ఈ అత్యాశలు చిన్న పనికైనా వెనుకాడే
ఈ మానవుని కెందుకు నదీ!
నదీ, నీకు ఎప్పుడైనా అనిపించదా స్థిరంగా ఉండాలని?
మృత్యువులాంటి ఈ సంద్రంలో కలవకుండా ఉండాలని?
నిరంతరం శ్రమిస్తూ పరుగులిడే నిన్ను చూసి
మేము నేర్చుకుంటాము గమ్యం చేరే దాకా ఆగరాదని.
నదీ ఓ నదీ, దయామయీ ఓ నదీ!

**(జనవరి 26 గణతంత్ర దినోత్సవ సందర్భంగా పెట్టిన కవితల పోటీలో (అప్పటికప్పుడే విషయం యిస్తారు) నెగ్గిన కవితలు.)**



# పెన్నిధి

- సాయి వాసుదేవ్, 7వ తరగతి

ఓ నదీ,

నీవే పేదల పాలిట పెన్నిధి

నీవే మా దైవ సన్నిధి

నీవే పిల్లలకు ఓ పాల నదివి

ఓ తల్లీ నీవో జీవనదివి

ఓ అమ్మా, ఎంత చల్లని గుండె నీది!

ఓ తల్లీ, నీది ఎంత మంచి ప్రేమ!

మా అందరికీ ఉరుకుల, పరుగుల నాట్యం నేర్పిన గురువువు నీవు

మా గొంతులు తడిపే అమృత భాండం నీవు

ఓ నదీ నీవు లేనిదే జీవకోటికి మెతుకే లేదు

నీవు మాకోసమే పరుగు పరుగున వస్తావు -

నిన్ను మేము చేస్తున్నాము కలుషితంగా

అయినా నీవు క్షమిస్తావు మమ్మల్ని దయగా.

మా పుణ్యభూమి మీద పారుతున్నాయి ఎన్నో నదులు

వాటన్నింటికీ నేను చేస్తున్నా పాదాభివందనాలు.







స్వరాంజలి

# వేగరావో

- శుకవాణి

వేగరావో వేగ రావో

సోలివాలెడి యీ సుమముగోయ ॥వే॥

నీవాలసించిన యిది

నేలరాలిపోవునో మరి

ధూళి గలసి పోవునో ..... ॥వే॥

మొన్న మొగ్గగా ముద్దులొలికి

నిన్న పూవుగా గంధాలు చిలికి

నేడు రెక్కలన్ని వడలిపోవ

వడగాడ్పుకు తాళలేదిది ... ॥వే॥

ఏవో కమ్మ తెమ్మెరలతో

ఏవో తేటి పాటలతో

పరవశించి బ్రతికినది గాని

తెలియదాయె ఇటులగునని ॥వే॥

ఎటు విన్నను నీ పిలుపేనని

ఎది కన్నను నీ రూపేనని

ఆతురమున తెలిసి వేగెడి యీ వేళ

చిలుకవా కరుణ వెర్రిపూవు పైన ॥వే॥





# ఆరోగ్య (ఆసుపత్రి)



## హోమియో, యోగ అనుబంధంగా ప్రకృతి వైద్యాలయం

**సాయిధామం, రామలింగంపల్లి (పోస్టు),**
**బొమ్మల రామారం (మం), నల్లగొండ జిల్లా-508126**
**సెల్ : 9440413455**

## మంచి ఆరోగ్యం కోరే వారికి శుభవార్త

గాఢమైన మందులు అవసరం లేకుండా ఆహార విహారాలలో చేయబడే మార్పుల ద్వారా ఈ క్రింద పేర్కొనబడ్డ దీర్ఘవ్యాధుల నివారణకు 18 పడకలతో వైద్యశాల (హాస్పిటల్) సాయిధామం ప్రాంగణంలో బాబా వారి ఆశీస్సులతో విజయవంతంగా నడుస్తున్నది. ఇక్కడ బాగుచేయబడే దీర్ఘవ్యాధులు

| | | |
|---|---|---|
| మలబద్ధకము | ఉబ్బసము (దమ్ము) | ఊబ శరీరం (అధిక బరువు) |
| అజీర్ణము | మధుమేహము (షుగర్) | మూల వ్యాధి (అర్శమొల్లలు) |
| ఎసిడిటి | రక్తపు పోటు (B.P) | కీళ్ళ నొప్పులు |
| అమీబియాసిస్ | రక్త హీనత | గుండె జబ్బులు |
| సయాటికా | పక్షవాతము | సోరియాసిస్ (చర్మ వ్యాధి) |
| స్పాండిలైటిస్ | బోదకాలు | కంటి జబ్బులు |
| కామెర్లు | వ్రణాలు | జలోదరము |
| హెపటైటిస్ | మూత్రంలో రాళ్ళు | స్త్రీల వ్యాధులు |

**మొదలైన దీర్ఘ వ్యాధులన్నిటికి సమర్థులైన వైద్యులచే చికిత్స చేయబడుతున్నది.**

**సంప్రదించు వేళలు : ఉ. 8.00 గం.ల నుండి 11.30 ని.ల వరకు**

**సోమవారం సెలవు**

**నిర్వహణ :**

డా॥ సి. ప్రభాకరరావు గారు
డైరెక్టరు
డా॥ జి. చంద్రారెడ్డి గారు, యోగాచార్య

డా॥ కృష్ణచైతన్య గారు, నిరంతర పర్యవేక్షకులు R.M.O.
డా॥ శ్రీమతి పి. ప్రసన్నలక్ష్మి గారు, మహిళా విభాగం
డా॥ శ్రీమతి జి. ఝాన్సీలక్ష్మి గారు, ఎం.డి. (విజిటింగ్)
అసిస్టెంట్ ప్రొఫెసర్, సిద్ధార్థ మెడికల్ కాలేజి,
విజయవాడ

భవదీయ ఆరోగ్యాభిలాషులు
**శ్రీ మాతా శుకవాణి**
ధర్మాధికారి మరియు
శ్రీ సాయి సేవా సమితి కార్యవర్గం, సాయిధామం





# సందేహానికి సమాధానం

**- గురూజీ**

శ్రీయుత సంపాదకుల వారికి

సప్రేమ నమస్కారములు.

2015 జనవరి "సచ్చిదానంద సద్గురు సాయివాణి (మాసపత్రిక) పుట 28" .... గడ్డిపైన తిరిగే తృణజలూక అనే (చిన్నపుల్లలా ఉంటుంది - గొంగళి పురుగుకీ యీ పేరుంది) పురుగు తన ముందరి భాగాన్ని ముందుకుపెట్టి తరువాత వెనుకభాగాన్ని ఎత్తినట్లుగా **జీవుడు** మరో ఆధారాన్ని వెదుక్కొనే **యిది** విడుస్తాడు....". ఈ వాక్యంలో జీవుడు మరొక శరీరాన్ని వెదుక్కొనే, తర్వాత పాత శరీరాన్ని విడుస్తాడు అని అర్థమగుచున్నది. మరి ఆ జీవుడు పాపపుణ్య కార్యములను బట్టి స్వర్గ నరకములను (ఆ లోకములలో ఎప్పడు అనుభవిస్తాడు? అయితే స్వర్గ నరకలోకములు లేవనా! ఉన్నవా? తెలుపగలరు.

**శ్రీ సాయి రామానంద స్వామి (76) పొరలకాండపల్లె**
**ప్రకాశం జిల్లా పూర్వాంధ్ర ప్రదేశము**

**ఇది ఆలోచనను రేకెత్తించే చక్కటి ప్రశ్న**

సహజంగా శుద్ధమైన పరమాత్మ అంశయైన జీవాత్మ శరీరధారణ చేసిన తరువాత తన శుభాఽశుభ కర్మల ద్వారా పుణ్యపాపాలను మూట కట్టుకొని ఆ మకిలిగా అంటించుకొని మరణ సమయంలో సూక్ష్మశరీరం ఈ స్థూల శరీరాన్ని విడిచి బయటకు వెళ్ళిపోతుంది. స్థూల శరీరం పంచ భూతాలలో కలిసిపోతుంది.

విశ్వసూత్రం ఒకటున్నది. ప్రతి చర్యకు అంతే మొత్తంలో ప్రతి-చర్య ఉంటుంది. (For everyaction there is an equal and opposite reaction) అంచేత మన రాబోయే జన్మకు సంబంధించిన స్వరూపస్వభావాలను ఇప్పటి మన ఆలోచనలు, చేతలు నిర్ణయం చేస్తూ ఉంటాయి. అంటే తరువాతి జన్మను మనమే నిర్ణయం చేసుకుంటున్నామన్నమాట. ఇక్కడే

జలూకంతో పోలిక. ఒక గొప్ప న్యాయాధీశుడుగా విశ్వవ్యాప్తమైన భగవచ్ఛక్తి మన పుణ్యపాపాలకు తగినట్టి జన్మనే మనకు ప్రసాదిస్తాడు. అది మన చర్యల ఫలితమే.

పుణ్యమూ, పాపమూ అంటకుండా తాను సాక్షీభూతుడుగా నిర్లిప్తంగా ధర్మమార్గంలో జీవించిన వారికి మరుజన్మ ఉండదని శాస్త్రము. కృష్ణ పరమాత్మ కూడా మరణసమయంలో నీ భావనలనుబట్టే మరుజన్మ వస్తుందనీ, నన్నే ధ్యానిస్తూ ఉంటే నా దగ్గరకే చేరుతావనీ చెప్పారు. దీనికి జడభరతుల వారి చరిత్రే ఉదాహరణ. గొప్ప తపస్వీ, విరాగీ అయి ఉండికూడా మరణ సమయంలో ఒక లేడి మీద ధ్యాసపెట్టడం వలన లేడి జన్మ ఎత్త వలసి వచ్చింది. అలా ఈ శరీరం వదిలేలోపలే మరుజన్మ నిర్ణయమైపోయింది.

**ఇక స్వర్గ నరకాల విషయం :** ఈ జీవుడు తన పుణ్యపాపాల ఫలితాన్ని కొంతభాగం స్వర్గంలోనూ, నరకంలోనూ అనుభవిస్తాడని శాస్త్రాలు చెబుతున్నాయి. అది వాస్తవమే. కాని ఆ లోకాలు ఎక్కడో లేవు. ఆ క్షేత్రాలు మన చుట్టూనే ఉంటాయి-స్థాయీభేదంతో. జీవుడు యాతనా శరీరం ధరిస్తాడు (ప్రేతాత్మలు అనవచ్చు) అవి మన చుట్టూ తిరుగుతూనే ఉంటాయి. కాని వాటి సంగతి మనకు తెలియదు. మన సంగతి వాటికి తెలియదు. వాటి లోకమే వేరు (ఇక్కడ లోకమంటే వేరే గోళమని కాదు. వాటి భావనాస్థితి.) మనందరికి కలలు సహజమే. ఆ కల కనేటప్పుడు అంతా సత్యంగా జరుగుతున్నట్లుగానే భావన కలుగుతుంది. ఆ కల కనే సమయంలో పెద్దపులి కన్పిస్తే భయపడతాం, నిధి దొరికితే సంతోషిస్తాం. నిజానికి శరీరం ప్రక్కమీదే ఉంటుంది. కలలో యింకో శరీరంతో యివన్నీ జరుగుతుంటాయి. ఈ విధంగా యింకా మరణించకముందే కొంతకొంత పుణ్య పాపఫలితాల్ని అనుభవిస్తూ ఉంటాము (ప్రారబ్ధం) శ్రీ సాయినాధుల వారి చరిత్రలలో దీనికి ఒక చక్కని ఉదాహరణ లభిస్తుంది. భీమాజీ పాటిల్ అనే క్షయరోగి ప్రారబ్దవశాత్తు తీవ్ర వ్యాధితో మరణాసన్నుడై చివరి ప్రయత్నంగా బాబా వారిని శరణువేడితే బాబావారు కరుణించి అతని





ప్రారబ్దకర్మను రెండు కలల ద్వారా అనుభవింపజేసి శరీరానికి ఆరోగ్యం సమకూర్చారు. అతడు ఉపాధ్యాయునిచేత తీవ్రంగా శిక్షింపబడనూ లేదు, గుండెల మీద బండ చేత రుద్దబడనూ లేదు. కాని కలలలోనే తీవ్రమైన బాధను అనుభవించటంచేత దుష్కర్మఫలితం రద్దైంది.

ఈ విధంగా యాతనా శరీరధారియైన జీవుడు సుఖాలుగాని, బాధలు గానీ తన కర్మఫలితంగా అనుభవించక తప్పదు. అవగాహన కోసం మన పురాణఋషులు వాటిని లోకాలుగా వర్ణించారు. అక్కడ కొంతకొంత అనుభవించిన తరువాత ఇంకా మిగిలిన కర్మలో కొంతభాగాన్ని (మిగిలింది సంచిత కర్మగా ఉంటుంది) ప్రారబ్దకర్మగా వెంట తీసుకొని కొత్త శరీరాన్ని ధరిస్తాడు. ఆ ప్రారబ్ధకర్మను అనుభవిస్తూ కూడా సరైన జ్ఞానాన్ని గురబోధల ద్వారా పొందకపోతే మళ్ళీ క్రొత్తకర్మలను అంటించుకొంటూ 'ఆగామి'గా యింతకుముందే మిగిలిఉన్న సంచితకర్మకు కలుపుకుంటూ జన్మ పరంపరలలో పడిపోతాడు.

ఇంతవరకు మహనీయుల అనుభవాల్నిబట్టి-ఈ జన్మలో ఎక్కువగా పుణ్యపాపాలు అంటని చిన్నపిల్లలు త్వరగా మరుజన్మను పొందుతారు. ఎక్కువగా లోకవ్యవహారాల వ్యామోహంలో చిక్కుకొని మరణించిన (అంటే శరీరాన్ని వదలివేసిన) జీవుడు మరుజన్మను ఆలస్యంగా పొందుతాడు. **శ్రీ సాయిబాబా వారి చరిత్రలో ఒక సంఘటన :** ఒక దంపతులు అనారోగ్యంతో మరణించిన తమ చిన్నపిల్లవాని శవాన్ని బాబా వారి ముందర పెట్టి వానిని బ్రతికించమని వేడుకొంటారు. అప్పుడు బాబా వారు యిలా అన్నారు. 'శిథిలమైన యీ శరీరాన్ని వదలివేసి ఆ జీవి అప్పడే ఒక తల్లి గర్భంలో ఆరోగ్యవంతమైన ఒక క్రొత్త శరీరంలో ప్రవేశించింది. దాన్ని చంపి మళ్ళీ ఈ శిథిలమైన శరీరంలో ప్రవేశపెట్టమంటారా? అని అడిగారట.

ఆత్మలకు మన స్పృహ లేకపోయినా కొందరు మీడియములు సాధన చేసి వాటిని ఆవాహన చేసుకుంటారు. ఈ పద్ధతి యూరప్, అమెరికాలలో జరుగుతూనే ఉన్నది. మన దేశంలో 'సోది' చెప్పేవారు యిలాంటివారే.

**(మిగతా 6వ పేజీలో)**